విద్యార్థులకు యూనిఫామ్ అందించాలి

కులకచర్లలో ఏకరూప దుస్తులను పరిశీలిస్తున్న డీఆర్డీవో శ్రీనివాస్


యాచారం : యూనిఫామ్‌లను పరిశీలిస్తున్న డీఆర్‌డీవో ఏపీడీ సూర్యారావు

- **వికారాబాద్ డీఆర్డీవో శ్రీనివాస్**
- **కులకచర్లలో స్టిచ్చింగ్ సెంటర్ పరిశీలన**

కులకచర్ల, జూన్ 11: విద్యార్థులకు సకాలంలో యూనిఫామ్ అందించాలని వికారాబాద్ డీఆర్డీవో శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మహిళా స్టిచ్చింగ్ కేంద్రాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల మేరకు విద్యార్థులకు ఏకరూప దుస్తులు కుట్టి ఇవ్వాల్సిన బాధ్యత మహిళా సంఘాల సభ్యులపై ఉందన్నారు. ఈ సందర్భంగా ఆయన స్టిచ్చింగ్ కేంద్రంలో మహిళా టైలర్లు కుట్టిన బట్టలను పరిశీలించారు. కార్యక్రమంలో కులకచర్ల ఎంపీడీవో రామకృష్ణనాయక్, డీపీఎం రామ్మూర్తి, ఏపీఎం శోభ, సిబ్బంది, టైలర్లు పాల్గొన్నారు.

రెండు జతలు పంపిణీ చేయాలి

యాచారం, జూన్ 11 : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రెండు జతల ఏకరూప దుస్తులను సకాలంలో పంపిణీ చేయాలని రంగారెడ్డి డీఆర్‌డీవో ఏపీడీ సూర్యారావు అన్నారు. మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో విద్యార్థులకు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్న యూనిఫామ్‌లను ఆయన మంగళవారం అధికారులతో కలిసి పరిశీలించారు. దుస్తులు, కుట్టు నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..విద్యార్థులకు రెండు జతల ఏకరూప దుస్తులను పంపిణీ చేయాలని, యూనిఫామ్ పంపిణీలో నిర్లక్ష్యం చేయొద్దన్నారు. బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో నరేందర్‌రెడ్డి, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసులు అప్రమత్తంగా ఉండాలి

వికారాబాద్ అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి


ధారూరు చెక్‌పోస్టును పరిశీలిస్తున్న వికారాబాద్ అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి

ధారూరు, జూన్ 11 : చెక్‌పోస్టుల వద్ద విధులు నిర్వహించే పోలీస్ సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని వికారాబాద్ జిల్లా అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ధారూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని చెక్‌పోస్టును బక్రీద్ పండుగ సందర్భంగా ధారూరు సీఐ రామకృష్ణతో కలిసి ఆయన సందర్శించి.. అక్కడి రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని.. ఎవరైనా చట్టవిరుద్ధంగా పశువులను రవాణా చేస్తే వెంటనే ఉన్నత అధికారులకు సమాచారం అందించాలన్నారు. ఒకే వాహనంలో పరిమితికి మించి జంతువులను తరలిస్తే ఆ వాహనాన్ని సీజ్ చేయాలన్నారు. ఆయన వెంట డీఎస్పీ ఇన్‌స్పెక్టర్ రాజు, తదితరులున్నారు.

అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్, చిత్రంలో పక్కన డీసీపీ నారాయణరెడ్డి

నకిలీ విత్తనాలు అమ్మొద్దు

- **అన్నదాతలను మోసం చేయొద్దు**
- **అవగాహన సదస్సులో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, డీసీపీ నారాయణరెడ్డి**

షాద్‌నగర్‌టౌన్, జూన్ 11 : ఆరుగాలం కష్టపడి పంటలను పండించే రైతన్నలను నకిలీ విత్తనాలతో మోసం చేయొద్దని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్‌నగర్ వ్యవసాయ, పోలీస్‌శాఖల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని ఎల్ఎన్ గార్డెన్‌లో విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందుల డీలర్లకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డితో కలిసి పాల్గొని మాట్లాడారు. అందరికీ అన్నం పెట్టే అన్నదాతలకు నష్టం చేయొద్దన్నారు. పంటలు సాగు చేసే రైతులకు మంచి విత్తనాలు ఇవ్వాలన్నారు. వ్యవసాయాధికారులు ఎప్పటికప్పుడు విత్తనాలు, ఎరువుల షాపులను పర్యవేక్షించాలన్నారు. రైతులకు మేలుచేసేలా ప్రభుత్వం రైతుబంధును పంపిణీ చేస్తున్నదని.. త్వరలోనే రూ.2 లక్షల వరకు రైతుల పంట రుణాలను ప్రభుత్వం మాఫీ చేస్తుందన్నారు. మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్ మాట్లాడుతూ దేశానికి అన్నం పెట్టే రైతన్నలకు నకిలీ విత్తనాలను విక్రయించొద్దన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

రైతులకు నష్టం కలిగేలా నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి, ఏసీపీ రంగస్వామి, వ్యవసాయ శాఖ ఏడీ రాజారత్నం, మండల వ్యవసాయాధికారి నిశాంత్‌కుమార్ హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రైతులకు విత్తనాలు విక్రయించాలన్నారు. క్రయవిక్రయాలకు సంబంధించిన రికార్డులు తప్పకుండా ఉండాలన్నారు. విత్తనాలు, ఎరువులు, మందులు కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగ్గా రసీదులు ఇవ్వాలన్నారు. ఎక్కడైనా నకిలీ విత్తనాల తయారీ, విక్రయిస్తున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు, డీలర్లు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు లాయర్లు దరఖాస్తు చేసుకోవాలి

షాబాద్, జూన్ 11 : రంగారెడ్డి జిల్లాలో లా కోర్సు చదివిన బీసీ విద్యార్థులు న్యాయవాది వృత్తిలో మూడేండ్ల ఉచిత శిక్షణ పొందేందుకు 2024-25 సంవత్సరానికి గాను దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నుంచి గుర్తింపు పొందిన కళాశాల నుంచి లా కోర్సు పాసై ఉండాలని.. వయోపరిమితి జూలై 2024 నాటికి 23 నుంచి 33 ఏండ్లలోపు ఉండాలన్నారు. తండ్రి/సంరక్షకుడి వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షలకు మించి ఉండరాదన్నారు. అభ్యర్థులు గాని, వారి కుటుంబంలో ఎవరైనా గతంలో ఈ ఉచిత శిక్షణ పొంది ఉండరాదన్నారు. బార్ కౌన్సిల్‌లో పేరు నమోదు చేసుకుని ఉండాలన్నారు. అర్హులైన బీసీ యువతీ యువకులు వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి శాఖ కార్యాలయం, రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్, ఐడీఓసీ కాంప్లెక్స్, కొంగరకలాన్, పిన్‌కోడ్-501510, 2వ అంతస్తు బిల్డింగ్‌లో ఈ నెల 25వ తేదీ సాయంత్రం 5గంటల వరకు దరఖాస్తులు సమర్పించాలన్నారు. దరఖాస్తుకు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, విద్యార్హత సర్టిఫికెట్లను జతచేయాలని సూచించారు.

పారిశుధ్య కార్మికులకు వేతనాలు చెల్లించాలి

పారిశుధ్య కార్మికుల వేతనాలు చెల్లించాలని ఎంపీడీవో జర్నప్పకు వినతిపత్రాన్ని ఇస్తున్న వికారాబాద్ జిల్లా సీఐటీయూ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, గ్రామాల పారిశుధ్య కార్మికులు

పెద్దేముల్, జూన్ 11 : గ్రామ పంచాయతీల్లో పనిచేసే సిబ్బందికి బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలని.. సిబ్బందిని పర్మినెంట్ చేయాలని వికారాబాద్ జిల్లా సీఐటీయూ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఆయా గ్రామాల పారిశుధ్య కార్మికులతో కలిసి కొద్దిసేపు నిరసన తెలిపి ఎంపీడీవో జర్నప్పకు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రజలకు అంటువ్యాధులు ప్రబలకుండా ప్రతిరోజూ పారిశుధ్య పనులు చేపట్టే సిబ్బందికి గత ఆరు, ఏడు నెలలుగా వేతనాలను పెండింగ్‌లో ఉంచడం తగదని.. వెంటనే నిధులు విడుదల చేసి అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జీవోనం.51ని సవరించి మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి పాత కేటగిరీలన్నింటినీ యథావిధిగా కొనసాగించాలన్నారు. విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు మృతి చెందిన సిబ్బంది కుటుంబానికి రూ.10 లక్షల నష్టపరిహారంతోపాటు రిటైర్మెంట్ బెనిఫిట్‌గా రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్పందించిన ఎంపీడీవో జర్నప్ప మాట్లాడుతూ పంచాయతీల్లో చేసే బిల్లుల్లో పారిశుధ్య సిబ్బందికి సంబంధించిన బిల్లులే మొదట ఉండేలా పంచాయతీ కార్యదర్శులను ఆదేశించామన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పారిశుధ్య కార్మికులు, కమిటీ సభ్యులు అంబరప్ప, సంగప్ప, రాములు, శ్రీను, వెంకటమ్మ, బాలమ్మ, రాసమ్మ, మల్లేశం పాల్గొన్నారు.

ఆయుష్‌ను సందర్శించిన ఒడిశా విద్యార్థులు

సైదాబాద్, జూన్ 11 : గడ్డి అన్నారంలోని ఆయుర్వేద పరంపర సంస్థను ఒడిశా రాష్ట్రం రూర్కెలాలోని ఉత్కల్మణి హోమియోపతిక్ మెడికల్ కాలేజీ విద్యార్థులు, దవాఖాన నాల్గో తరగతి బీహెచ్ఎంఎస్ వైద్య విద్యార్థులు మంగళవారం సందర్శించారు. డాక్టర్ అశ్వనీకుమార్ సాహూ, డాక్టర్ సుభాన్సు ప్రభామిశ్రా పర్యవేక్షణలో వారు ఆయుష్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయుష్ సంస్థ ఇన్‌చార్జి అసిస్టెంట్ డైరెక్టర్ జీపీ ప్రసాద్ ఆయుష్ సంస్థల పనితీరు, చేపట్టే కార్యక్రమాలు, గ్రంథాలయంలోని పురాతన తాళపత్ర గ్రంథాలు, వైద్య చికిత్స చరిత్రకు సంబంధించిన విషయాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఆయుష్ పరిశోధన అధికారి డాక్టర్ బిస్వోరంజన్‌దాస్, డాక్టర్లు అష్పాక్‌అహ్మద్, శ్రీదేవి, సాకేత్‌రామ్, సంతోష్‌మనే, లైబ్రేరియన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలను సహించం

అక్రమ నిర్మాణాలను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో సాధన

పెద్దఅంబర్‌పేట, జూన్ 11 : ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే సహించేదిలేదని డీఎల్‌పీవో సాధన స్పష్టం చేశారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం గౌరెల్లి గ్రామంలోని 191 సర్వేనంబర్‌లో ల్యాండ్ కన్వర్షన్(ఎల్‌సీ) లేకుండా చేపడుతున్న నిర్మాణాలను మంగళవారం ఆమె పరిశీలించారు. ఎల్‌సీ లేకుండా గత పంచాయతీ కార్యదర్శుల అండతో పదుల సంఖ్యలో అక్రమ నిర్మాణాలు వెలిసినట్లు వచ్చిన ఫిర్యాదుపై ఆమె క్షేత్రస్థాయి పరిశీలన జరిపారు. కార్యక్రమంలో ఎంపీవో వినోద, పంచాయతీ కార్యదర్శి శశిధర్, ఎంపీటీసీ బాలలింగస్వామి, మల్లేశ్, కృష్ణ, ధన్‌రాజ్, చిరంజీవి పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఎంపీ, ఎమ్మెల్యే పరామర్శ

కడ్తాల్, జూన్ 11 : మండల కేంద్రం సమీపంలోని బట్టర్‌ఫ్లై సిటీ వెంచర్‌లోని విల్లాలో ఆరు రోజుల క్రితం గోవిందాయిపల్లి గ్రామానికి చెందిన శేషుగారి శివగౌడ్, గుండెమోని శివగౌడ్ దారుణహత్యకు గురైన విషయం తెలిసిందే. కాగా మంగళవారం సాయంత్రం నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, కల్వకుర్తి ఎమ్మెల్యే నారాయణరెడ్డి స్థానిక నాయకులతో కలిసి గోవిందాయిపల్లిలోని బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జంట హత్యలకు పాల్పడిన నిందితులకు చట్ట ప్రకారం శిక్ష పడుతుందన్నారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వపరంగా న్యాయం చేస్తామని హామీఇచ్చారు. అనంతరం బాధిత కుటుంబాలకు రూ.పది వేల చొప్పున మొత్తం రూ.20వేల ఆర్థిక సాయాన్ని అందించారు. అదేవిధంగా గ్రామంలో ఇటీవల ఆత్మహత్యకు పాల్పడిన మహిళా కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేల ఆర్థిక సాయాన్ని అందించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, రవికాంత్‌గౌడ్, నర్సింహ, భాస్కర్‌రెడ్డి, బీచ్చానాయక్, బీక్యానాయక్, వెంకటేశ్, కేశవులు, జంగయ్య, శంకర్, శేఖర్‌గౌడ్, రాజేశ్, హీరాసింగ్, సీఐ శివప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థులు సృజనాత్మకతను పెంచుకోవాలి

టీ- హబ్ సీఈవో శ్రీనివాసరావు

బంజారాహిల్స్, జూన్ 11 : సృజనాత్మక ఆలోచనలు కలిగి ఉండి వినూత్న ఆవిష్కరణలపై ఆసక్తి కలిగిన విద్యార్థులకు టీ-హబ్ ద్వారా మంచి అవకాశాలుంటాయని టీ-హబ్ సీఈవో శ్రీనివాసరావు మహంకాళి అన్నారు. బంజారాహిల్స్‌లోని సుల్తాన్ ఉల్ ఉలూమ్ ఎడ్యుకేషన్ సొసైటీలోని ఎస్‌యూ నాలెడ్జ్ హబ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇన్నోవేటర్స్ ఫెస్ట్ కార్యక్రమాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఇన్నోవేషన్, స్టార్టప్, హెల్త్‌కేర్ విభాగాల్లో విద్యార్థులు రూపొందించిన పలు నమూనాలను ఆయన తిలకించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సృజనాత్మక ఆలోచనలు పెంచుకుని.. ఆవిష్కరణలపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ మహ్మద్ వలీవుల్లా, గౌరవ కార్యదర్శి జాఫర్ జావెద్, జోగేందర్ తనికెళ్ల, డాక్టర్ అబ్దుల్ ముఖీద్ తదితరులు పాల్గొన్నారు.

బంజారాహిల్స్‌లోని సుల్తాన్ ఉల్ ఉలూమ్ ఎడ్యుకేషన్ సొసైటీలో ఇన్నోవేటర్స్ ఫెస్ట్‌లో నమూనాలు తిలకిస్తున్న టీ-హబ్ సీఈవో శ్రీనివాసరావు తదితరులు

గాంధీకి వైద్యపరికరాలు అందజేత

కాలేజీ పూర్వ వైద్య విద్యార్థి డాక్టర్ దివేశ్ అనిరెడ్డి ఔదార్యం

గాంధీ దవాఖాన గ్యాస్ట్రో ఎంటరాలజీ హెచ్‌వోడీ శ్రావణ్‌కుమార్‌కు వైద్య సామగ్రిని అందజేసిన అమెరికా వైద్యుడు దివేశ్ అనిరెడ్డి

బన్సీలాల్‌పేట్, జూన్ 11: గాంధీ మెడికల్ కాలేజీ పూర్వ విద్యార్థి, తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం, అమెరికాశాఖ అధ్యక్షుడు, సీనియర్ గ్యాస్ట్రో ఎంటరాలజీ వైద్యుడు డాక్టర్ దివేశ్‌అనిరెడ్డి, సికింద్రాబాద్‌లోని గాంధీ దవాఖాన గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగానికి రూ.50 లక్షల విలువైన వైద్య పరికరాలను విరాళంగా అందజేశారు. గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగం హెచ్‌వోడీ, ప్రొఫెసర్ శ్రావణ్‌కుమార్ మంగళవారం ఆయనకు సన్మానం చేసి, ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ.. గాంధీ వైద్య కళాశాలలో 1978లో ఎంబీబీఎస్ పూర్తి చేసిన దివేశ్‌అనిరెడ్డి, తాను చదివిన కాలేజీ, దవాఖానకు విలువైన వైద్య సామగ్రిని అందజేసి ఎందరో పూర్వ విద్యార్థులకు ఆదర్శంగా నిలిచారన్నారు. గతంలోనూ పలుమార్లు స్వదేశానికి వచ్చే సమయంలో తనకు ఫోన్ చేసి గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగానికి ఏమైనా సామగ్రి అవసరమా.. అని అడిగారని.. చెప్పిన సామగ్రిని అమెరికాలో కొనుగోలు చేసి విమానంలో ఇక్కడికి తీసుకొచ్చి ఇవ్వడం ఎంతో అభినందనీయమన్నారు. నేటి తరం వైద్యులు ఆయన్ను ఆదర్శంగా తీసుకుని, తాము కూడా సంపాదించిన దానిలో కొంత సమాజానికి తిరిగి ఇవ్వాలన్నారు. అనంతరం దాత దివేశ్‌అనిరెడ్డి మాట్లాడుతూ.. తాను 1987లో అమెరికా వెళ్లిన తర్వాత సేవాభావం కలిగిన మిత్రులతో కలిసి 20 ఏండ్ల క్రితం తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరాన్ని ఏర్పాటు చేశామన్నారు. విద్యావైద్యం, వ్యవసాయం, నైపుణ్య, శిక్షణ రంగాల్లో తెలంగాణలో అనేక సామాజిక, సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తాను చదువుకున్న గాంధీ వైద్య కళాశాల తనకు మాతృసంస్థ లాంటిదని, వేలాది మంది నిరుపేదలకు కార్పొరేట్ స్థాయిలో వైద్యాన్ని అందిస్తున్నదని.. అందువల్ల తనవంతు సాయం చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మెరుగుపరచాల్సిన విద్యావ్యవస్థపై తమ సంస్థ చేసిన పరిశోధన వివరాలతో కూడిన నివేదికను గత ప్రభుత్వానికి అందజేశామన్నారు. కార్యక్రమంలో గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగం వైద్యులు, నర్సులు పాల్గొన్నారు.

నత్తకు నడక నేర్పేలా.. క్రమబద్ధీకరణ

హెచ్ఎండీఏలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల స్థితిగతులు

లక్ష్యం నిర్ణయించినా వేగవంతం కానీ క్రమబద్ధీకరణ ప్రక్రియ

ప్లానింగ్ విభాగంపై పని భారం.. కార్యాచరణలో తీవ్ర జాప్యం

సిటీబ్యూరో, జూన్ 11(నమస్తే తెలంగాణ): నత్తకు నడక నేర్పేలా హెచ్ఎండీఏలో ఎల్లారెస్ క్రమబద్ధీకరణ ప్రక్రియ కొనసాగుతున్నది. ప్రభుత్వానికి ఆదాయం.. ప్లాట్ల యజమానులకు ఎంతో ఊరట కలిగించే ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల అంశం క్రమబద్ధీకరణలో నత్తనడకన సాగుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం గత ఫిబ్రవరిలోనే ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను వేగంగా పరిశీలించి, మార్చి 31 నాటికి క్రమబద్ధీకరణ పూర్తి చేస్తామంటూ ఆర్భాటంగా ప్రకటించింది. మార్చి గడిచిపోయి రెండు నెలలు అవుతున్నా... ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే..' అన్న చందంగా ఉంది. ప్రధానంగా నగర శివారు ప్రాంతాల నుంచి హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) పరిధిలో 3.4 లక్షలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. ప్రణాళికా విభాగంలో తక్కువ సిబ్బంది ఉండటంతో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా చేయలేకపోతున్నారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిశీలించి క్రమబద్ధీకరణ చేస్తే ఫీజుల రూపంలో సుమారు రూ.450 కోట్ల మేర ఆదాయం రావొచ్చని అధికారులు అంచనా వేశారు. నాలుగు జోన్లుగా విస్తరించిన హెచ్ఎండీఏ పరిధి 25-30 కి.మీ వరకు ఉండటంతో ఆయా ప్రాంతాలకు వెళ్లి క్షేత్ర స్థాయిలో లే అవుట్లను, ప్లాట్లను పరిశీలించాలంటే తగిన సిబ్బంది అందుబాటులో లేరని, అందుబాటులో ఉన్న సిబ్బందితో చేస్తుండటంతో చాలా తక్కువ సంఖ్యలో ప్లాట్ల క్రమబద్ధీకరణ జరుగుతోందని ప్లానింగ్ విభాగానికి చెందిన ఓ అధికారి తెలిపారు.



హెచ్ఎండీఏ నాలుగు జోన్ల పరిధిలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు

జోన్స్	స్వీకరించిన దరఖాస్తులు
శంకర్‌పల్లి	73915
ఘట్‌కేసర్	159672
మేడ్చల్	30850
శంషాబాద్	80289
మొత్తం	344726

ప్లానింగ్‌లో పని భారం..

గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) పరిధి దాటిన తర్వాత విస్తరించి ఉన్న హెచ్ఎండీఏలోని శివారు ప్రాంతాల్లో కొత్తగా పట్టణీకరణ శరవేగంగా చోటు చేసుకుంటోంది. ఈ ప్రాంతాల్లో కొత్తగా భవన నిర్మాణాల అనుమతులు, లే అవుట్ల అనుమతులు ఇవ్వడానికి చాలా సమయం పడుతోంది. ప్లానింగ్ విభాగంలో గతంతో పోల్చితే ఇప్పుడు పని భారం చాలా ఎక్కువగా ఉందని, దానికి సరిపడా నైపుణ్యం కలిగిన ప్లానింగ్ సిబ్బంది లేకపోవడంతో ఎల్ఆర్ఎస్ ప్రక్రియను వేగంగా పూర్తి చేయకపోతున్నామనే అభిప్రాయాన్ని ప్లానింగ్ విభాగం అధికారులు వ్యక్తం చేస్తున్నారు. గతంలోనూ ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణ కోసం ప్రత్యేకంగా సిబ్బందిని నియమించి పూర్తి చేసిన విషయాన్ని అధికారులు ప్రభుత్వానికి విన్నవించినా, సిబ్బందిని పెంచడం లేదు. తక్కువ సిబ్బంది ఉండటం వల్లే వేగవంతంగా ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ప్రక్రియను పూర్తి చేయలేకపోతున్నామని, ఈ విషయంలో ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందని ప్లానింగ్ విభాగం అధికారులు పేర్కొంటున్నారు.

లక్షల్లో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు..

గ్రేటర్ హైదరాబాద్ తర్వాత ఉన్న హెచ్ఎండీఏ పరిధిలో భారీ సంఖ్యలోనే ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు వచ్చాయి. ఏడు జిల్లాల్లో విస్తరించిన ఉన్న హెచ్ఎండీఏ పరిధిలోని 47 మునిసిపాలిటీలను మినహాయిస్తే, మిగతా ప్రాంతాల్లోంచి వచ్చిన దరఖాస్తులే 3,44,726 వరకు ఉన్నాయి. వీటిలో ఇప్పటి వరకు 60 వేల దరఖాస్తులను హెచ్ఎండీఏ అధికారులు జోన్ల వారీగా పరిశీలించారు. మిగతా వాటిని పరిశీలన చేయాలంటే తగినంత సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల క్రమబద్ధీకరణ విషయంలో అధికారుల్లో అయోమయం నెలకొంది. ప్రధానంగా ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల క్రమబద్ధీకరణ ప్రక్రియ చేపట్టాలంటే నిపుణులైన ప్లానింగ్ సిబ్బంది చాలా కీలకం. ప్రస్తుతం, హెచ్ఎండీఏతో సిబ్బంది అందుబాటులో లేదని, అలాంటి పరిస్థితుల్లో లక్షలాది దరఖాస్తుల పరిశీలన వేగంగా పూర్తి చేయడం అసాధ్యమనే అభిప్రాయాన్ని ప్లానింగ్ విభాగం అధికారులు వ్యక్తం చేస్తున్నారు.

కార్మికుల సంక్షేమమే ప్రధాన ధ్యేయం

238 మంది అసైన్‌మెంట్ కార్మికులకు రెగ్యులర్ ఆర్డర్లు, 181 మందికి పదోన్నతి

హయత్‌నగర్, జూన్ 11: నల్లగొండ, రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల సహాయక సహకార యూనియన్ మదర్ డెయిరీ సంస్థలో పనిచేస్తున్న కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తున్నామని సంస్థ చైర్మన్ లింగాల శ్రీకర్‌రెడ్డి తెలిపారు. హయత్‌నగర్‌లోని మదర్ డెయిరీ కార్యాలయంలో పాల శ్రీతలీకరణ కేంద్రంలో పనిచేస్తున్న 238 మంది అసైన్‌మెంట్ కార్మికులకు రెగ్యులర్ ఆర్డర్లు, 181 మంది రెగ్యులర్ ఎంప్లాయీస్‌కు ప్రమోషన్స్ ఆర్డర్ కాపీలను సంస్థ చైర్మన్ లింగాల శ్రీకర్‌రెడ్డి, పాలకవర్గ సభ్యులతో కలిసి మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ సంస్థ ఆర్థిక పరిస్థితి కొంత మేరకు ఇబ్బందికరంగానే ఉన్నా 15 నుంచి 20 ఏండ్లుగా పనిచేస్తున్న కార్మికులకు న్యాయం చేయాలనే ఉద్దేశంతోనే పాలకవర్గం ఈ మేరకు నిర్ణయం తీసుకుందన్నారు. పదోన్నతులు, రెగ్యులర్ చేసే విషయంలో పూర్తి పారదర్శకతతో వ్యవహరిస్తున్నామన్నారు. కొంతమంది కార్మికుల వద్ద అక్రమ వసూళ్లు చేసి లబ్ధి చేకూర్చుకున్నట్లుగా వస్తున్న ఆరోపణలు అవాస్తమని తెలిపారు. యూనియన్‌లో ఎటువంటి నిర్ణయం అయినా బోర్డు ఆమోదంతోనే తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు చింతలపూడి వెంకట్ రామిరెడ్డి, వెంకటరామిరెడ్డి, లక్ష్మీనర్సింహారెడ్డి, మందడి ప్రభాకర్‌రెడ్డి, కస్తూరి పాండు, జాల రాంరెడ్డి, అలివేలూరంగారెడ్డి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వర్షాలతో అప్రమత్తంగా ఉండండి

సిటీబ్యూరో, జూన్ 11(నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో కురుస్తున్న వర్షాలతో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అధికారులకు మేయర్ గద్వాల విజయలక్ష్మి ఆదేశాలు జారీ చేశారు. జోనల్ కమిషనర్లు, ఎస్ఈలతో మంగళవారం సాయంత్రం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. వర్షాలు వస్తున్న మీదట అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండి సహాయక చర్యలు వేగంగా చేపట్టాలన్నారు. వాటర్ లాగింగ్ ప్రాంతాలు, నాలాల వద్ద ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉండాలని మేయర్ సూచించారు. ఈ సందర్భంగా అన్ని జోన్లలో పరిస్థితి నియంత్రణలో ఉందని మేయర్‌కు జోనల్ కమిషనర్లు పేర్కొన్నారు.

రేపు ఆంత్రప్రెన్యూయర్ టాక్

సిటీబ్యూరో, జూన్ 11(నమస్తే తెలంగాణ): సెంటర్ ఫర్ డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నోస్టిక్స్‌లోని ఇంక్యుబేషన్ సెంటర్ ఆధ్వర్యంలో ఈ నెల 13న ఆంత్రప్రెన్యూయర్ టాక్ జరుగనుంది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రెడ్డీస్ ల్యాబ్ మాజీ డైరెక్టర్, యూటోఫియా ఫౌండర్ ఉదయ్‌సక్సేనా ముఖ్య వక్తగా వ్యవహరించనున్నారు. ఉదయం 11.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ సమావేశంలో పాల్గొనేందుకు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. సీడీఎఫ్‌డీ ఇంక్యుబేషన్ సెంటర్‌లో యాక్టివిటీని పెంచే క్రమంలో ఇటీవలే ఆంత్రప్రెన